సాక్షి
సూర్యాపేట
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



మత్తుకు యువత బానిస
మత్తుకు సంబంధించిన ఔషధాలు కలిగి ఉన్న ఇద్దరిని నల్లగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



నీటిని విడుదల చేయాలని..
ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం రైతు సంఘం వినతిపత్రం అందజేసింది. - 8లో



భక్తిభావాలతో జీవనం
క్రీస్తు సందేశం, భక్తిభావాలతో జీవనం సాగించాలని ఖమ్మం మేత్రాసన మాజీ బిషప్ పాల్‌మైపన్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

182 మంది బాల కార్మికులకు విముక్తి

సూర్యాపేట క్రైం: జిల్లాలో నెల రోజులు పాటు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా నిరాదరణకు, వెట్టిచాకిరీకి గురవుతున్న 182మంది బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించామని జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలురు 85మంది, బాలికలు 11మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన బాలురు 65మంది, బాలికలు 21మంది ఉన్నారని పేర్కొన్నారు. బాలలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్, వివిధ శాఖల సిబ్బందికి అభినందనలు తెలిపారు.

8న పోలీస్ వాహనాల పాత సామగ్రి వేలం

జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో ఈ నెల 8న పోలీస్ వాహనాల పాత సామగ్రిని బహిరంగ వేలం వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వాహనాలకు ఉపయోగించిన 113 టైర్లు, ట్యూబ్‌లు, 46 బ్యాటరీల తోపాటు ఇతర సామగ్రి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వేలంలో ఎవరైనా నేరుగా పాల్గొనవచ్చని, వివరాలకు పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి సురేష్ సెల్ : 8712686019 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ తదితరులు

కోదాడ అర్బన్: సైబర్ మోసాల పట్ల వయోవృద్ధులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి జ్యోతి పద్మ అన్నారు. శుక్రవారం కోదాడలోని విశ్రాంత భవన్‌లో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో గూగుల్ సంస్థల సహకారంతో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేరగాళ్లు ఎవరికి కనిపించకుండా అనేక మోసాలకు పాల్పడుతుంటారని, ఆన్‌లైన్, సెల్ ఫోన్లు వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ బాధ్యులు శ్యామ్ ప్రాజెక్టర్ ద్వారా ప్రజెంటేషన్ చేస్తూ సైబర్ నేరాలను వివరించారు. అనంతరం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించి బ్రోచర్‌ను, పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోదాడ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీతారాయమ్మ, రాంబాబు, హమీద్ ఖాన్, డాక్టర్ జాస్తి సుబ్బారావు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు వెంకటయ్య



కార్యదర్శి ఆకాష్‌వర్మ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భూపతి వెంకటయ్య, కార్యదర్శిగా ఆకాష్‌వర్మతో పాటు పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి మహేంద్రసాగర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

10న కోదాడ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

కోదాడ: గత నెల 27న కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీ అయిన ఆ రెండు పదవులకు ఈ నెల 10న ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు కోదాడ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఉదయం పది గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఆర్‌డీఓ సమక్షంలో ఈ ఎన్నిక జరగనున్నట్లు పేర్కొన్నారు.

• బాధ్యతల స్వీకరణ



పాలకవీడు మండలం రావిపహాడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీ దయాకర్



జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెంలో జీపీ రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసులు

ఏటా లోటే..!

లక్ష్యం చేరని సీఎంఆర్ సేకరణ

- 2023 వానాకాలంలో 13.50 శాతం, యాసంగిలో 89 శాతం పెండింగ్
- గత నెలాఖరుతో ముగిసిన గడువు
- గడువు పొడిగించాలని మిల్లర్ల వేడుకోలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ ఏటా ఆలస్యమవుతోంది. కేంద్ర ప్రభుత్వం రెండు, మూడుసార్లు గడువు పొడిగించినా మిల్లింగ్‌లో వేగం కనిపించడం లేదు. సీఎంఆర్ గడువు గత నెల 31తో ముగిసినప్పటికీ 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి లక్ష్యాన్ని చేరలేదు. సీఎంఆర్ సేకరణ విషయంలో అధికారుల ఉదాసీనత కారణంగా మిల్లర్లు జాప్యం చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మిల్లులకు ధాన్యాన్ని కేటాయించిన సమయంలో కాకుండా సీఎంఆర్ గడువు ముగుస్తున్న సమయంలో లక్ష్యాలు చేరుకోవాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. 2021-22లో లక్ష్యాలు చేరుకోని పలు మిల్లుల యజమానులకు 25 శాతం జరిమానా విధించినా.. కొద్దిరోజుల క్రితం కొందరు మిల్లర్లపై కేసు నమోదు చేసినా పరిస్థితిలో మార్పు లేదు.

గడువు పొడిగిస్తున్నా..

పౌర సరఫరాల సంస్థ నిబంధనల మేరకు ప్రతిఏటా ఒక సీజన్‌కు సంబంధించి ఆరు నెలల్లో కేటాయించిన ధాన్యానికి బియ్యం అప్పగించాల్సి ఉన్నా జిల్లాలోని కొంతమంది రైస్ మిల్లర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి అందజేయాల్సిన ఒక సీజన్‌లోని బియ్యాన్ని వాయిదా వేస్తూ మరొక సీజన్‌లో వచ్చే ధాన్యం మిల్లింగ్ చేసి ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే మూడు సార్లు గడువు పొడిగించినా ఇంకా లక్ష్యాలు చేరుకోలేదంటే కొందరు మిల్లర్లు ఆడిందే ఆటగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. బియ్యం కోసం అధికారులు మిల్లర్లపై ఒత్తిడి చేసిన సందర్భంలో కొంత మంది మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేస్తుండగా.. మరికొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించిన చౌక బియ్యం దందా కొనసాగించే వ్యాపారులను ఆశ్రయించి క్వింటాకు రూ.1,400 నుంచి రూ.1,500 వరకు కొనుగోలు చేసి రీసైక్లింగ్ పద్ధతికి పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇంకొంత మంది ఉద్దేశ పూర్వకంగానే సీఎంఆర్ లక్ష్యం చేరుకోకపోవడం గమనార్హం. అక్రమాలకు పాల్పడితే సంబంధిత మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా మిలర్లపై కేసులు నమోదు చేసేందుకు వెనుకాడేదిలేదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

2023 సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	కేటాయించినధాన్యం	సీఎంఆర్ లక్ష్యం	అందించింది	పెండింగ్
వానాకాలం	3,31,333	2,10,261	1,81,043	29,218
యాసంగి	3,61,445	2,42,168	25,099	2,17,069

ప్రత్యేక దృష్టి సారించినా..

సీఎంఆర్ సేకరణపై జిల్లా కలెక్టర్ వెంకట్రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి మిల్లు లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పది రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. అప్పటినుంచి మిల్లింగ్ వేగవంతం చేసినా లక్ష్యాలను చేరుకోలేదు. బుధవారం (జనవరి 31వ తేదీ) నాటికి 2023 వానాకాలం సీజన్‌కు సంబంధించి 86.50 శాతం అప్పగించగా యాసంగి సీజన్ సీఎంఆర్ సేకరణ లక్ష్యం మరింత దారుణంగా ఉంది. మిల్లులకు కేటాయించిన ధాన్యం కేవలం 11.36 శాతం మాత్రమే అప్పగించారంటే మిల్లర్ల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా బుధవారంతో సీఎంఆర్ సేకరణ గడువు ముగిసింది. గడువు పొడిగించాలని మిల్లర్లు కోరుతున్నారు. అయితే గడువు పెంచుతారా..? లేక ఫైన్ వేసి మిగిలిన ధాన్యం టెండర్ ద్వారా విక్రయించేందుకు నిర్ణయం తీసుకుంటారని అనే విషయంపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది.

ఎఫ్‌ఎల్‌సీకి ఏర్పాట్లు చేయండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలో ఈ నెల 5న చేపట్టే ఎఫ్‌ఎల్‌సీకి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు కృష్ణయ్య, సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు(కాంగ్రెస్), అబిద్(బీజేపీ), దేవరశెట్టి సత్యనారాయణ(బీఆర్‌ఎస్), కోట గోపి(సీపీఎం), స్టాలిన్(బీఎస్పీ), డేగల రమేష్(వైఎస్సార్ సీపీ) పాల్గొన్నారు

ఈ–పాలనతో మెరుగైన సేవలు

ఈ–పరిపాలన ద్వారా ప్రత్యేక అధికారులు ఆకస్మిక పర్యటనలు చేసి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చేశారని కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి జిల్లా ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక అధికారుల బాధ్యతలు పెరిగాయన్నారు. ప్రతి బుధవారం రెండు లేక మూడు గ్రామ పంచాయతీలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఈఓ అశోక్, డీటీడీఓ శంకర్, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, డీఎస్‌ఓ మోహన్ బాబు, పరిశ్రమ డీఎం తిరుపతయ్య పాల్గొన్నారు.

6న సెమినార్

జిల్లాలోని డ్రాయింగ్-డిస్‌బర్స్‌మెంట్ అధికారుల (డీడీఓల)కు ట్యాక్స్ డెడికేటెడ్ ఎట్ సోర్స్(టీడీఎస్)పై ఈ నెల 6న కలెక్టరేట్‌లో సెమినార్ నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు.

కందులు క్వింటా రూ.10,217



తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు రికార్డు ధర పలికింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకు 544 బస్తా కందులు రాగా క్వింటాకు గరిష్టంగా రూ.10,217 కనిష్టంగా రూ.8,089 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉంటే అంత కంటే అధిక ధర పలకడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు.

అవిశ్వాసం నెగ్గింది.. ఫలితం ఆగింది

- రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- హైకోర్టు ఉత్తర్వులతో వెల్లడించని ఫలితం
- వైస్ చైర్మన్‌ను అనర్హుడిగా ప్రకటించిన డీసీఓ



విజయ సంకేతం చూపిస్తున్న డైరెక్టర్లు

గరిడేపల్లి: మండలంలోని రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పటికీ ఫలితం ఆగింది. అవిశ్వాసంపై శుక్రవారం జిల్లా సహకార అధికారి అధికారి(డీసీఓ) శ్రీధర్ కీతవారిగూడెంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే మొత్తం 13 మంది డైరెక్టర్లకుగాను ఒకరు ఇటీవల చనిపోగా మిగిలిన 12మందిలో కాంగ్రెస్‌కు నలుగురు, బీఆర్‌ఎస్‌కు ఎనిమిది మంది ఉన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురు కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది మంది డైరెక్టర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్, మరో బీఆర్‌ఎస్ డైరెక్టర్ సమావేశానికి హాజరు కాలేదు. అయితే అవిశ్వాసం నెగ్గినప్పటికీ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించడంతో ఫిబ్రవరి 5 వరకు ఫలితాన్ని వెల్లడించవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస ఫలితాన్ని అధికారికంగా వెల్లడించలేదని జిల్లా సహకార అధికారి పేర్కొన్నారు. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిందని, వైస్ చైర్మన్‌ని అనర్హుడిగా ప్రకటించారు. ఈ నెల 5 తర్వాత హైకోర్టు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

పీఏసీఎస్‌ను భ్రష్టుపట్టించారు..

రాయినిగూడెం పీఏసీఎస్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, చైర్మన్ భ్రష్టు పట్టించారని పీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సమావేశం అనంతరం కాంగ్రెస్ డైరెక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. అవిశ్వాసాన్ని ఎదుర్కోలేక కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్‌కు చైర్మన్ పదవి దక్కించుకోవడం ఖాయమన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రాయినిగూడెం పీఏసీఎస్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జుట్టుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రత్యేక’ విద్యార్థులు 2,487 మంది

- ముగిసిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే
- ఇంటింటా వివరాలు సేకరించిన ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది
- యూడైస్ పోర్టల్‌లో అప్‌లోడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం



తిరుమలగిరిలో సర్వే చేస్తున్న అధికారి (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంఖ్య తేలింది. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయూతనందించేందుకు సమగ్ర శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ద్వారా గత ఏడాది డిసెంబర్ 19న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించిన సర్వే ఇటీవల ముగిసింది. వివిధ రకాల వైకల్యం ఉన్న మొత్తం 2,487 మందిని అధికారులు గుర్తించారు.

ప్రత్యేక వైద్యం అందించాలని..

ఎముకల బలహీనత, పక్షవాతం, బుద్ధిమాంద్యం, రక్త హీనత, మాటలురాని వారు, చదవడం, రాయడం ఇబ్బంది పడుతున్న వారు, దీర్ఘకాలిక కండరాల వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి సాధారణ విద్యార్థుల మాదిరిగానే సమాన అవకాశాలు కల్పించడంతో పాటు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఉద్దేశం. దీనిలో భాగంగానే 2023-24 విద్యా సంవత్సరానికి ఐఈఆర్‌పీలు ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించారు. గుర్తించిన విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. చిన్నతనం నుంచే అంగ వైకల్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం విద్య, వైద్యసేవలు అందించడానికి నిధులు కేటాయిస్తుంది.

18 ఏళ్లలోపు వారి గుర్తింపు

జిల్లాలోని 23 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు కోసం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఇంటింటి సర్వే నిర్వహించారు. దీంతో పాటు ఆయా గ్రామాల అంగన్‌వాడీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సహాయం తీసుకున్నారు. ఈ సర్వేలో 18 ఏళ్ల లోపు వయసు గలవారిని గుర్తించారు. సర్వే పూర్తయిన తరువాత వీరిలో పాఠశాలలో చదివే వారు, భవిత సెంటర్లు, ఇంటి వద్దనే చదువుకున్న వారిని గుర్తించారు. ఇంటి వద్ద చదువుకునే వారికి వారానికి ఒక్కటి, రెండు రోజులు ఐఆర్‌పీలు వెళ్లి చదువు చెప్పనున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం నుంచి అందించే సదుపాయాలతో పాటు వీరిలో కొందరిని పాఠశాలకు తీసుకొచ్చేందుకు సహాయకులను కేటాయించి వారికి డబ్బులు చెల్లించనున్నారు. ట్రై సైకిళ్లు, టీచింగ్ కిడ్స్, వినికిడి యంత్రాలు తదితర పరికరాలు అందించడంతో పాటు ఫిజియోథెరపీ డాక్టర్‌తో నెలకు నాలుగు పర్యాయాలు చికిత్స అందించనున్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం




మానసిక వైకల్యం కలిగిన పిల్లలను సర్వే ద్వారా గుర్తించాం. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వీరి చదువుతోపాటు వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. మిగతా పిల్లలతో సమానంగా విద్యను అందిస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

తెరపైకి రేపాల మండలం

- నాన్ ఆయకట్టులోని 11 గ్రామాలతో ఏర్పాటు చేయాలి
- మండల సాధన సమితి సభ్యుల డిమాండ్
- వారం రోజులుగా ఆందోళన బాట



రేపాల గ్రామ పంచాయతీ వ్యూ

మునగాల: జిల్లాలో మరో కొత్త మండలం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. కోదాడ నియోజకవర్గంలోని మునగాల మండల పరిధిలో గల రేపాల మేజర్ గ్రామ పంచాయతీని రూరల్ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి డిమాండ్ చేస్తోంది. వారం రోజుల క్రితం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సమితి రేపాల కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసిన సమితి సభ్యులు వారం రోజులుగా ఆందోళన బాట పట్టి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని 11 పంచాయతీలు

మునగాల మండల పరిధిలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 11 పంచాయతీలు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో ఉండగా మిగిలిన 11 గ్రామాలైన రేపాల, నర్సింహులగూడెం, జగన్నాథపురం, కలకోవ, విజయరాఘవపురం, సీతానగరం, మాధవరం, తాడువాయి, వెంకట్రాంపురం, నేలమర్రి, ఈదుల వాగు తండాలు నాన్ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. కొన్నేళ్లుగా ఈ 11 గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మొత్తం మండలాన్ని కెనాల్ ప్రాంతంగా భావిస్తూ వర్షాభావ సమయంలో కూడా ప్రభుత్వాలు కరువు మండలంగా ప్రకటించడం లేదు. దీంతో ఎత్తిపోతల పథకాలు కూడా లేని ఈ ప్రాంత ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అన్ని అవకాశాలు ఉన్నా..

నాన్ ఆయకట్టులోని గ్రామాల ప్రజలు ప్రస్తుతం మునగాల మండల కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 15నుంచి 20కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తోంది. అలాగే 65వ హైవేపై ఉన్న మొద్దులచెరువు నుంచి ఖమ్మం–సూర్యాపేట హైవేపై ఉన్న మోతె మండల కేంద్రం వరకు రేపాల మీదుగా డబుల్ రోడ్డు ప్రతిపాదన ఉన్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ముఖ్యంగా రేపాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆసుపత్రి, కెనరా బ్యాంకు, మీసేవ, రైతువేదిక, విద్యుత్ సబ్‌స్టేషన్, హైస్కూల్, ప్రభుత్వ వసతి గృహాలు ఉండడంతోపాటు ఏటా ఫిబ్రవరిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర జరుగుతుంది. ఈ గ్రామం నుంచే జగన్నాథపురం, సీతానగరం, నర్సింహులగూడెం గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వం మునగాల మండలాన్ని రెండు క్లస్టర్లగా విభజించి రేపాలలో ఒకటి, మునగాలలో మరొక పీహెచ్‌సీలను ఏర్పాటు చేసినప్పటికీ అన్ని అవకాశాలు ఉండి కూడా రేపాలను మండలంగా చేయలేదు. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి స్పందించి నాన్ ఆయకట్టు గ్రామాలతో రేపాల కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయడంతోపాటు మాధవరం చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

“ రేపాల మండలం ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యం



రేపాల కేంద్రంగా 11 నాన్ ఆయకట్టు గ్రామాలను కలుపుకొని కొత్త మండలం ఏర్పాటు చేయాలి. రేపాల మండలం ఏర్పాటైతేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. రాజకీయాలకు అతీతతంగా మండలం సాధన కోసం పోరాడుతాం.

– మొగిలిచెర్ల సత్యనారాయణ, మండల సాధన సమితి సభ్యుడు, రేపాల

“ అభివృద్ధికి దూరంగా రేపాల



కొన్నేళ్లుగా పాలకవర్గాలు రేపాల పరిసర గ్రామాలను పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో సరైన రోడ్లు, ఆర్టీసీ బసుసల సౌకర్యం లేదు. దీంతో మేము నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. రేపాల కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలి.

– పల్లి ఆదిరెడ్డి, మండల సాధన సమితి సభ్యుడు, రేపాల

“ మండలం సాధించేవరకు పోరాడుతాం



రేపాల మండలం సాధించేవరకు తాము పోరాడుతాం. వెనుకబడిన రేపాల పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే మండలం ఏర్పాటు ఒక్కటే మార్గం. మా ప్రాంతంలో ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందడం లేదు. కొత్త మండలం ఏర్పాటు చేయాలన్నదే మా లక్ష్యం.

– పొనుగోటి రంగా, మండల సాధన సమితి సభ్యుడు, రేపాల

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

నార్కట్‌పల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాతిశ్యాహం అనే వ్యక్తి స్థానిక రాశీ రీఫ్యాక్టర్ కంపెనీలో ఉద్యోగ రీత్యా కొన్ని ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడ పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం డ్యూటీకి రాకపోవడంతో తన స్నేహితుడు సొంత ఊరికి వెళ్లాడనుకొని ఇంటికి ఫోన్ చేశాడు. అక్కడకి రాలేదన్న సమాచారంతో తోటి ఉద్యోగి రామ్ జిట్ కెహాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఔషధ దుకాణాలపై అధికారుల దాడులు



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ: పట్టణంలోని పలు ఔషధ దుకాణాల్లో శుక్రవారం అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ మందుల దుకాణంపై కేసు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ బిల్లులు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో ఆర్‌ఎంపీలకు అధిక మోతాదులో మందులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. తనిఖీల్లో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ దాసు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అండర్ 9, 11, 13, 15 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొనాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సూర్యాపేట అర్బన్, రూరల్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ 18 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి కోటాచలం శుక్రవారం తెలిపారు. ఈ నెల 12న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

భూదాన్‌పోచంపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారి అఖిల భారతి చీడపీడలు, జీవన నియంత్రణ సమన్వయం కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని ఇంద్రియాల గ్రామంలో పర్యటించారు. రైతులు సాగు చేసిన పలు రకాల పంటలను పరిశీలించారు. చీడపీడల వల్ల పంటలకు కలిగే నష్టాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రామకృష్ణబాబు, అనిల్‌కుమార్, ఏఈఓ భుక్య దేవ్‌సింగ్, నరేష్, శిరీష, పవిత్రన్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో పెద్దపులి కలకలం!

- పులి సంచరిస్తుందన్న సమాచారంతో వణికిపోతున్న జనం
- గాలిస్తున్న అటవీ, పోలీసుశాఖ సిబ్బంది



రైల్వేట్రాక్‌పై పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, స్థానికులు

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రం శివారులో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. గూడ్స్ రైలు గార్డ్ (సీఎంసీఎన్) సమాచారంతో పోలీసు, రైల్వే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి కదలికలను గుర్తించేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది రంగప్రవేశం చేశారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. చిట్యాల నుంచి బీబీనగర్ వైపు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గూడ్స్ రైలు వెళ్లింది. రైలు చివరి క్యాబిన్‌లో గార్డ్ డ్యూటీ చేస్తున్న వ్యక్తి 45కి.మీ మైలురాయి వద్ద (హరిహరపుత్ర రైసుమిల్లు) పెద్ద పులి రైల్వేట్రాక్‌ను దాటి కొమ్మాయిగూడెం వైపు వెళ్లడం చూశానని రామన్నపేట రైల్వేస్టేషన్ మాస్టర్‌కు తెలిపాడు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులతో పాటు పోలీసు, అటవీశాఖ అధికారులకు చేరవేశాడు. వారు ట్రాక్‌పై పనిచేసే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని మెసేజ్ పంపారు. సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, అటవీశాఖ పోలీసు సిబ్బంది, స్థానికులతో కలిసి 45వ నంబర్ మైలురాయి పరిసరాల్లో పర్యటించారు. పులి కనిపించిన ప్రాంతం వద్ద రైతులు, గొర్ల కాపరుల సంచారం ఎక్కువగా ఉండడంతో అధికారులు వారిని అప్రమత్తం చేశారు. పులి సంచారానికి సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొమ్మాయిగూడెం, పెద్దకాపర్తి, సిరిపురం, జనంపల్లి, బోగారం తదితర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పులి సంచారంపై డీఎఫ్ఓ శోభారాణిని సంప్రదించగా ఈ ప్రాంతంలో పెద్దపులులు లేవని, అలాగని పులి సంచరించలేదని చెప్పలేమని తెలిపారు. అటవీశాఖ సిబ్బంది పులి కదలికలను తెలుసుకునేందుకు ఫీల్డ్‌మీదికి వెళ్లినట్లు చెప్పారు. కాగా.. రాత్రి వరకు పులిజాడ తెలియరాలేదు. పులిని చూసిన గార్డ్ మొబైల్‌ఫోన్ క్యాబిన్‌లోని బ్యాగులో ఉండడం, రైలు 50 నుంచి 60 కి.మీ వేగంతో వెళ్లడంతో ఫొటో తీయలేకపోయినట్లు తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

"రామన్నపేట శివారులో పులి కనిపించిందనే సమాచారం అందింది. వెంటనే పోలీసు సిబ్బంది పులి కనిపించిన ప్రదేశానికి వెళ్లి చూశాం. రైతులు, గొర్లకాపరులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయబావుల వద్దకు గుంపులుగా వెళ్లాలి. పులి కనిపిస్తే సమాచారం అందించాలి.

– వెంకటేశ్వర్లు, సీఐ, రామన్నపేట

ఘనంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నల్లగొండ పట్టణంలోని గుత్తా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రక్తదానం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, యామ కవిత దయాకర్, నాయకులు అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, అనిస్‌ముక్తర్, హన్ను, వంగాల సహదేవరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు, మాలె శరణ్యారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, చిత్రంలో చాడ కిషన్‌రెడ్డి తదితరులు

మత్తు ఇంజక్షన్లకు యువత బానిస

- నల్లగొండలో పలువురి యువకుల వద్ద మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనాదీప్తి



మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్‌లను చూపుతున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వైద్యుడి సిఫారసు లేకుండా మత్తుకు సంబంధించిన స్పాస్మో ప్రాక్సివాన్ ప్లస్, అల్ట్రా కింగ్ టాబ్లెలెట్‌లు, ట్రామాడెక్స్ ఇంజక్షన్‌లు కలిగిన ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా కొత్త తరహాలో మత్తు మందుకు యువత బానిస అవుతున్నట్లు బయటపడింది. నిందితులను, మత్తు మందులను అమ్మిన వారిని అరెస్ట్ చేసి, వారి దగ్గర మత్తు మందులకు సంబంధించిన టాబ్‌లెట్స్, ఇంజక్షన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి శుక్రవారం వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని రహ్మాన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ జబీఉల్లా, ఎన్‌జీ కాలేజీ వెనుక బాగంలోని శ్రీనగర్‌కాలనీ చెందిన మహ్మద్ సల్మాన్ మత్తు మందులతో పట్టబడినట్లు తెలిపారు. వీరిద్దరు శివాజీనగర్‌లోని న్యూ హెల్త్‌కేర్ ఫార్మసీకి చెందిన యజమాని తాడోజు నరేష్ వద్ద మత్తు మందులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొందరు యువకులు మత్తు టాబ్లెట్లను, ఇంజక్షన్లను తాము తీసుకోవడమే కాకుండా తమ ఇళ్లలో నిల్వ చేసుకుని ఇతరులకు కూడా విక్రయిస్తున్నారని ఎస్పీ చెప్పారు. ఈ మత్తు టాబ్లెట్లను మింగి పైనుంచి చక్కెర నీళ్లు తాగడం వల్ల ఎక్కువ మత్తు వస్తుందని, గంజాయి పీల్చిన దానికంటే ఎక్కువ మత్తులోకి జారుకుంటారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని, క్రయ, విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. మత్తు పదార్థాల సమాచార విషయంపై సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, 100 నంబర్‌కు డయల్ చేసి గానీ తెలియజేయాలని కోరారు. కొత్త తరహాలో మత్తుకు బానిస అవుతున్న యువతను కట్టడి చేసి మంచి మార్గంలో నడిపించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. నేరస్తులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

- మోతాదు ప్రకారం పురుగు మందులు వాడితే మంచి దిగుబడులు
- నడిగూడెం వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలో, పలు ప్రాంతాల్లో పిలకల దశలో ఉంది. ప్రస్తుతం చల్లని వాతావరణం ఉండడంతో వరి పంటలో చీడపీడలు ఆశించి నష్ట పరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని.. మోతాదు ప్రకారమే వాడాలని, నివారణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు: ఈ పురుగు నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరు పొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. అంకురం నుంచి చిరు పొట్టదశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలు పోతుంది. ఈ పురుగు ఆలస్యంగా నాట్లు పెట్టినా లేదా ముదురు నాట్లు పెట్టినా ఆశిస్తాయి. నత్రజని ఎరువులు తక్కువగా వాడడం వలన కాండం బలహీనంగా మారినప్పుడు ఈ పురుగు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలు తుంచి వేయాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతి వారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించి నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్‌ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ (దోమపోటు): ఈ పురుగు నారు మడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం, తాలుగింజలు లేదా నూర్చినప్పుడు నూకపోవడం జరుగుతుంది.

నివారణ చర్యలు: దోమను తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



అగ్గి తెగులు సోకిన వరి పైరు

ఉల్లికోడు లేదా గొట్టపు రోగం : ఇది నారుమడి, పిలక దశలో ఆశిస్తుంది. అంకురం ఉల్లికాడ లాగా పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి. సెప్టెంబరులో 200 మి.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే ఇది వ్యాపిస్తుంది.



సాగులో ఉన్న వరి చేను

నివారణ చర్యలు: దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

పాముపొడ తెగులు: దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు: విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రాపికొనాజోల్ 1 .మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు : తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇది విస్తరించి మచ్చలు చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపించి నష్ట పరుస్తుంది. వరి దుబ్బుల్లో, వరి గడ్డిపైన, కలుపు మొక్కల్లో స్థావరం ఏర్పరచుకొని అనుకూల పరిస్థితుల్లో వరి పైరుపై ఆశిస్తుంది. నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడటం, గాలిలో తేమ అధికంగా ఉండడం, మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు, ఉష్ణోగ్రత 25–30 సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తిస్తుంది.

నివారణ చర్యలు: విత్తనశుద్ధి చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలంలో నీటిని తీసి బాగా ఆరనివ్వాలి. దీని వలన శిలీంధ్రం తాలూకు సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసీన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు

శాలిగౌరారం: మహిళను వేధించిన కేసులో శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన నిందితుడికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన నాగయ్య(35) 2015లో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ మహేశ్ 36/2015 ఐపీసీ 354 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం మహిళను వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బాషబోయిన నాగయ్యకు శుక్రవారం నకిరేకల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ సంవత్సరం జైలు శిక్షతో పాటూ రూ.2 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మణ్ వాదించారు. నేరం రుజువు చేసేందుకు ఆధారాలను నిర్ణీత సమయంలో కోర్టులో సమర్పించిన లైజనింగ్ అధికారి రవి, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌లను ఎస్‌ఐ సతీష్ అభినందించారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

దేవరకొండ : ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. దేవరకొండకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వస్తే రైతుబంధు, రైతు బీమా అమలుపై నిదీయాలని ప్రజలకు సూచించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసింది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందన్నారు. సమావేశంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, జెడ్పీటీసీలు కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి, మాధవరం సునీతాజనార్దన్‌రావు, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, నాయకులు గాజుల ఆంజనేయులు, వడ్త్యా రమేష్‌నాయక్, ముత్యాల సర్వయ్య, టివిఎన్ రెడ్డి, హన్మంతు వెంకటేష్‌గౌడ్, మారుపాకుల సురేష్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలని మంత్రికి వినతి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ, ఎస్‌ఎల్‌బీసీ, వరద కాల్వకు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రానున్న వేసవికాలంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు తక్షణమే ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, కుంటలను నింపితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ ఎస్‌ఎస్‌పీ ఎస్‌ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం, పారేపల్లి శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలోని ముఖ మండపంలో 108బంగారు, వెండి కలశాలలో శుద్ధజలం, సుగ్రంథ ద్రవ్యాలను పోసి ప్రత్యేక పూజలు చేసిన వాటితో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకించారు. అంతకుముందు ఆలయంలో హోమం నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఇక ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలను విశేషంగా కొనసాగించారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అధికారులు రఘు, సురేందర్‌రెడ్డి, శ్రావణ్ తదితరులున్నారు.

ప్రేమ జంటలను వేధిస్తున్న ముఠా

- సన్నిహితంగా ఉన్న సమయంలో రహస్యంగా వీడియోలు తీస్తున్న యువకులు
- బ్లాక్‌మెయిల్ చేసి నగదు, బంగారు ఆభరణాలు దోపిడీ
- మహిళలపై లైంగికదాడికి పాల్పడుతున్న గ్యాంగ్
- పరువుపోతుందని బయటికి చెప్పని బాధితులు

నల్లగొండ క్రైం: ప్రేమజంటలు సన్నిహితంగా ఉన్న సమయంలో ఓ సైకో గ్యాంగ్ సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీడియోలు చూపించి వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు దోచుకుంటున్నారు. అంతేకాకుండా మహిళలు, యువతులపై లైంగికదాడికి పాల్పడుతున్నారు. నల్లగొండ పట్టణంలోని నార్కట్‌పల్లి – అద్దంకి ప్రధాన రహదారి పానగల్ బైపాస్ సమీపంలోని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ వద్ద ఈ గ్యాంగ్ వ్యవహారం బయటపడింది. వీరు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఆరుగురు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నల్లగొండ పట్టణానికి చెందిన కొందరు ప్రేమ జంటలు, వివాహేతర సంబంధం ఉన్న వారు చెట్లపొదల మధ్య సన్నిహితంగా ఉండడాన్ని పసిగట్టి సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియో తీసి ఆయా జంటలను బ్లాక్ మెయిల్ చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్నారు. ఎవరికైనా చెప్తే మీ ఇంట్లో వాళ్లకు ఈ వీడియోలు పంపుతామని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇస్తేనే వీడియోలను డిలీట్ చేస్తామని వారికి ఫోన్ కాల్స్ చేస్తున్నారు. దీంతో పరువు పోతుందని, వివాహేతర సంబంధం బయట పడుతుందనే ఉద్దేశంతో ఈ విషయాలను బాధితులు ఎవరికీ చెప్పడం లేదు. గత మూడేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వెలుగులోకి ఇలా..

ఓ యువకుడు తన ప్రియురాలిని తీసుకొని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. వారు సన్నిహితంగా ఉన్న సమయంలో గ్యాంగ్‌లోని యువకులు యువతిని బలవంతంగా కొట్టి లైంగిక దాడికి పాల్పడి వీడియో తీశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు లాక్కున్నారు. అదే సమయంలో వివాహేతర సంబంధం కలిగిన మరో జంట పై ఇదే తరహాలో దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఓ వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకురావడంతో ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలిసింది. దోపిడీ చేసిన నగదు, బంగారు ఆభరణాలు రికవరీ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. అనేక మంది మహిళలు బాధితులుగా ఉన్నట్లు ఫోన్ కాల్‌డేటా ఆధారంగా తెలుస్తోంది. ఈ విషయంపై నల్లగొండ టూటౌన్ ఎస్సై నాగరాజును వివరణ కోరగా.. ఆ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసుల బృందం గాలిస్తున్నట్లు తెలిపారు.